సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 12 । జూలై । 2024



అంతమొందిస్తున్నారు!

8లో▸

మానవత్వం మంటగలుస్తోంది..మానవ మృగాలు బంధాలను తెంచుకుంటున్నారు. అయిన వారని కూడా చూడకుండా కడతేరుస్తున్నారు. మానవ విలువలను మండగలుపుతున్నారు.



సీఎం దృష్టికి ట్రిపుల్‌ఐటీ సమస్యలు

బాసరలోని ట్రిపుల్‌ఐటీ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. యూనివర్సిటీ స్టూడెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆకాశ్ సీఎంను కలిసి సమస్యలు విన్నవించారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
33.3 /26.3

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. తుపాను ప్రభావంతో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చదువుపై శ్రద్ధ పెట్టాలి

- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

భీమారం: విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగం తగ్గించి చదువుపై శ్రద్ధ పెడితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో సోషల్ మీడియా, సెల్‌ఫోన్ వినియోగంతో కలిగే అనర్థాలపై గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాఠశాలకు చెందిన ఇద్దరు బాలికలు బుధవారం పారిపోయారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద బుధవారం రాత్రి పట్టుకున్నారు. గురువారం వారిని తిరిగి పాఠశాలకు చేర్చారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఏసీపీ హాజరై మాట్లాడారు. తల్లిదండ్రుల ఆశలు వమ్ము చేయకుండా శ్రద్ధగా చదువుకుంటే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఉన్నత ఆశయాలతో చదివి సమాజంలో గొప్ప పౌరులుగా ఎదగాలని సూచించారు. శ్రీరాంపూర్ సీఐ మోహన్, ఎస్సై బి.రాములు, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కనకలక్ష్మి, ఆపరేషన్ ముస్కాన్ టీం సభ్యులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం



శ్రీకాంత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ప్రభాకర్

బెల్లంపల్లి: తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను బెల్లంపల్లికి చెందిన కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ బండి ప్రభాకర్ సత్కరించారు. హైదరాబాద్‌లో శ్రీకాంత్‌గౌడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బండి ప్రభాకర్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.

నీటిపారుదల శాఖ ఎస్ఈగా సత్యరాజచంద్ర

బెల్లంపల్లి: నీటి పారుదల శాఖ బెల్లంపల్లి ఎస్ఈగా ఎ.సత్యరాజచంద్ర నియమితులయ్యారు. నీటి పారుదల శాఖలో ఇటీవల బదిలీలు జరగగా పెద్దపల్లి ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈగా పని చేస్తున్న సత్యరాజచంద్రను బెల్లంపల్లి ఎస్ఈగా బదిలీ చేశారు. ఈమేరకు సత్యరాజచంద్ర గురువారం బాధ్యతలు చేపట్టారు. బెల్లంపల్లి నీటి పారుదల శాఖ ఎస్ఈ పోస్టు కొన్ని నెలలుగా ఖాళీగా ఉంటోంది. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఈని నీటి పారుదల శాఖ అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టీహబ్‌ను సందర్శించిన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు



టీ-హబ్ వద్ద ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా హైదరాబాద్‌లోని టీ-హబ్‌ను గురువారం సందర్శించారు. ఉదయం యాత్రను డీటీడీవో గంగారం ప్రారంభించారు. హైదరాబాద్ చేరుకున్న విద్యార్థులు టీహబ్‌లో శాస్త్ర సాంకేతిక విషయాలు, వ్యాపార వాణిజ్య అంశాలను తెలుసుకున్నారు. మారుతున్న కాలానికి మార్పును అందిపుచ్చుకోవటానికి శాస్త్ర సాంకేతిక విజ్ఞాన కేంద్ర సందర్శన విద్యార్థులకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీటీడీవో చిరంజీవి, స్పోర్ట్స్ ఆఫీసర్ జీవరత్నం, ఉపాధ్యాయులు శంకర్, రమేశ్, ధనలక్ష్మి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు పెంచాలి



విద్యార్థుల సామర్థ్యాలు పరీక్షిస్తున్న డీఈవో

కోటపల్లి: విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంచాలని డీఈవో యాదయ్య అన్నారు. రాపన్‌పల్లి, రాంపూర్, దేవులవాడ పాఠశాలలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో పాఠాలు చదివించి విద్యాసామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాలలో సమస్యలు, పెండింగ్ పనులను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. డీఈవో వెంట సెక్టోరియల్ అధికారి చౌదరి ఉన్నారు.

రైతుకే భరోసా..

- ఎవుసం చేసేటోళ్లకు సాయం అందాలి
- 'కౌలు'ను ఆదుకోవాలి.. పోడును మరువొద్దు
- క్యాబినెట్ సబ్ కమిటీ ఎదుట ఉమ్మడి జిల్లా రైతులు..
- అన్నదాత అభిప్రాయాలు సేకరించిన మంత్రులు, అధికారులు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. పక్కన మంత్రులు తుమ్మల, పొంగులేటి, సీతక్క, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు తదితరులు

సాక్షి, ఆదిలాబాద్: 'కౌలు రైతులకు న్యాయం జరగాలి.. పోడు భూములకూ భరోసా కల్పించాలి.. ఒకే కుటుంబంలో ఉన్న పట్టాదారులందరికీ న్యాయం చేయాలి.. పదెకరాల వరకు పథకం ఉండాలి.. మళ్లీ కౌలురైతు చట్టం తేవాలి.. రియల్ ఎస్టేట్ వాటిని మినహాయించి సాగు భూములకే పథకాలు వర్తింపజేస్తూ అన్నదాతకు భరోసా కల్పించాలి. ఈ ప్రాంత రైతులకు కొన్ని ప్రత్యేక పరిమితులు కల్పించేలా విధి విధానాలు ఉండాలి.. సాగు మొదట్లోనే సాయం అందాలి. వానాకాలం, యాసంగికి ముందు జూన్, డిసెంబర్‌లోనే పెట్టుబడి సాయం ఖాతాల్లో జమకావాలి.' ఇలా ఉమ్మడి జిల్లా రైతులు, రైతు సంఘాల నాయకులు 'రైతు భరోసా'పై తమ అభిప్రాయాలను మంత్రివర్గ ఉపసంఘం ఎదుట వెలిబుచ్చారు. ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా అన్నదాతకు న్యాయం చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు తమ సూచనలు అందించారు.

కేబీ కాంప్లెక్స్‌లో సమావేశం..

రైతు భరోసా పథకం అమలులో విధివిధానాలు రూపొందించేందుకు ప్రభుత్వం రైతుల నుంచే అభిప్రాయాలు సేకరిస్తుంది. ఇందుకోసం నియమించిన మంత్రివర్గ ఉప సంఘం గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు విచ్చేసింది. ఐటీడీఏ కేబీ కాంప్లెక్స్‌లో సమావేశం నిర్వహించారు. ఉప సంఘం చైర్మన్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సభ్యులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రెవన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కలు పాల్గొని రైతుల అభిప్రాయాలను విన్నారు. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండే విఠల్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం కలెక్టర్లు రాజర్షిషా, అభిలాష అభినవ్, కుమార్ దీపక్, వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఉదయం 11.20 గంటలకు మంత్రివర్గ ఉప సంఘం వేదికపైకి చేరుకుంది. మధ్యాహ్నం 2.30 గంటల వరకు వర్క్‌షాప్ కొనసాగింది. ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, ఇతర అధికారులు ప్రజాప్రతినిధులకు స్వాగతం పలికారు. వర్క్‌షాప్ ముగిసిన తర్వాత ఉప ముఖ్యమంత్రి, మంత్రులు హైదరాబాద్‌కు తిరిగి వెళ్లారు.



రైతు భరోసా అభిప్రాయసేకరణలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా రైతులు

ధరణి కారణంగా అనేక సమస్యలు..



వ్యవసాయ భూములకు సంబంధించి ధరణి కారణంగా అనేక సమస్యలు తలెత్తాయి. ఎప్పుడో భూములు వదిలేసి, అమ్ముకొని వెళ్లిన వారు ధరణిలో తిరిగి తమ పేరు రావడంతో ఆ భూములను చిన్న, సన్నకారు రైతుల నుంచి గుంజుకుంటున్నారు. రైతు బంధుకు సంబంధించి ఎన్‌ఆర్‌ఐలు కూడా ఎక్కడో ఉండి ఇక్కడ ఉన్న పొలాలకు చెక్కులు పొందుతున్నారు. ఇవన్నీ పరిగణలోకి తీసుకొని క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ జరుపుతున్నాం.

– సీతక్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి

పరిమితులొద్దు..



రైతు భరోసా పథకం అమలులో మంత్రివర్గం ఇప్పటివరకు ఎలాంటి పరిమితులు విధించలేదని చెబుతున్నారు. దీంట్లో ఏదో చేయాలనే ఉద్దేశం లేదని ప్రభుత్వ పెద్దలు పేర్కొంటున్నారు. ఎలాంటి పరిమితులు లేకుండా యథావిధిగా అమలు చేస్తే సంతోషమే.

– గోడం నగేశ్, ఆదిలాబాద్ ఎంపీ

ఆమోదయోగ్యంగా ఉండాలి..



రైతు భరోసా పథకం అమలులో విధివిధానాల రూపకల్పన కోసం ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణకు రావడం గర్వించదగ్గింది. ఇది అందరికీ ఆమోదయోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాను.

– గడ్డం వంశీ, పెద్దపల్లి ఎంపీ

పదెకరాల వరకు అమలు చేయాలి



రైతులకు విపత్తు సమయంలో పరిహారం అందించే ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి. రైతుల ప్రీమియం డబ్బులు ప్రభుత్వమే చెల్లించాలి. బడా పారిశ్రామిక వేత్తలకు, మూడు పంటలు సాగు చేసే పెద్ద రైతులకు పంట పెట్టుబడి సాయం అందించకుండా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ముందుకెళ్లాలి. పదెకరాలు సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా అమలు చేయాలి.

– పాయల్ శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే

'పోడు' పరిష్కరించాలి



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ముఖ్యంగా సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గానికి సంబంధించి ముఖ్యమైన ప్రాజెక్ట్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పూర్తి చేసే విషయంలో ప్రభుత్వం దృష్టి సారించాలి. పోడు భూముల సమస్య పరిష్కారానికి చొరవ చూపాలి.

– పాల్వాయి హరీశ్‌బాబు, సిర్పూర్ ఎమ్మెల్యే

రైతుల ప్రయోజనాలు కాపాడాలి



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయం తీసుకోవాలి. ఇక్కడి రైతులు ఎంతో శ్రమపడి పంటలను సాగు చేస్తున్నారు. ఆ మేరకు ప్రయోజనాలు దక్కడం లేదు.

– రామారావు పటేల్, ముథోల్ ఎమ్మెల్యే

స్పెషల్ ప్యాకేజీ ప్రకటించాలి..



వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 80 శాతం రైతులు వర్షాధారంపైనే పంటలు సాగు చేస్తున్నారు. ఈ జిల్లాకు ప్రభుత్వం స్పెషల్ ప్యాకేజీ ప్రకటించాలి. ప్రత్యేకంగా బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించి ఆదుకోవాలి.

– ప్రేమ్‌సాగర్ రావు, మంచిర్యాల ఎమ్మెల్యే

కౌలు రైతుకు మేలు జరగాలి..



రైతు భరోసా అమలులో కౌలు రైతులనూ పరిగణలోకి తీసుకోవాలి. వారికి ఎలాంటి ప్రయోజనాలు దక్కడం లేదు. ఈ విషయంలో వారికి ప్రయోజనం దక్కేలా విధివిధానాలు ఉండాలి.

– గడ్డం వివేక్, చెన్నూర్ ఎమ్మెల్యే

పోడు సమస్య పరిష్కరించాలి



పోడు సాగును అధికారులు అడ్డుకుంటున్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ఆ రైతులకు నష్టం జరుగుతుంది. ఈ విధానాలు ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా ఉన్నాయి. ధరణితో తిరిగి పట్టాలు పొందిన భూస్వాములకే రైతు భరోసా లబ్ధి చేకూరుతుంది. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులకు పట్టాలు లేవు. అనాదిగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. రెవెన్యూ శాఖ ఈ సమస్యను పరిష్కరించాలి.

– వెడ్మ బొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే

విమర్శలు సరికాదు..



గత ప్రభుత్వం అప్పులు చేసిందని, పథకాల అమలులో తప్పులున్నాయని విమర్శలు సరికాదు. రైతుబంధు ప్రతీ రైతుకు ఇవ్వడం జరిగింది. అలాగే కోట్లాది రూపాయలతో ప్రతీ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి.

– అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే

ఆంక్షలు విధించవద్దు..



అన్నివర్గాల రైతులను ఆదుకున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు పథకంతో ప్రజలకు చేరువయ్యారు. ఈ పథకంలో ఆంక్షలు వద్దు. ఏజెన్సీ ప్రాంత గిరిజనేతరులకు పట్టాలు లేవు. వారికి రైతు భరోసా ఏవిధంగా ఇవ్వాలో ఆలోచన చేయాలి.

– కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే

కౌలు చట్టం అమలు చేయాలి..



2011 కౌలు చట్టాన్ని తిరిగి అమలు చేయాలి. సాగు చేసుకుంటున్న నిజమైన రైతుకు న్యాయం జరగాలి. 30 నుంచి 40 శాతం మంది కౌలు రైతులే ఉన్నారు. వారికి ఎలాంటి ప్రయోజనాలు దక్కకపోవడంతో సాగులో నష్టాలు చవిచూసి 95 శాతం మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.– **క్లైం కరుణాకర్‌రెడ్డి, రైతు, తలమడుగు**

పదెకరాల వరకు ఇవ్వాలి



పదెకరాల వరకు రైతు భరోసాను ఇస్తే బాగుంటుంది. పంటను అమ్ముకునే రైతులకు బోనస్ కల్పించాలి.

– బోరంచు శ్రీకాంత్ రెడ్డి, రైతు, మావల

సగం సగం ఇవ్వండి..



రైతు భరోసా పథకం అమలులో కౌలు రైతులకు న్యాయం చేయాలి. అందుకోసం వారికి సగం.. పట్టా భూములు ఇచ్చిన వారికి సగం ఆర్థిక సాయం అందేలా చూడాలి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పదెకరాలు సాగు చేసే రైతులందరికీ తప్పకుండా రైతు భరోసా వర్తింపజేయాలి.

– మేస్రం జంగు, రైతు

కుటుంబ నియంత్రణతోనే జనాభా తగ్గుదల

మంచిర్యాలటౌన్/నస్పూర్: కుటుంబ నియంత్రణను పాటించడం ద్వారా జనాభా పెరుగుదల కొంతమేర తగ్గుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగానస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు గురువారం ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలోని 21 ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 100 పల్లె, బస్తీ దవాఖానాలలో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలను చేపట్టినట్లు తెలిపారు. గర్భధారణ, గర్భాల మధ్య అంతరం, తల్లీబిడ్డలకు గుర్తింపు క్షేమదాయం అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రతీ జంట కుటుంబ నియంత్రణపై మాట్లాడాలన్నారు. కుటుంబ నియంత్రణ కోసం అనేక పద్ధతులు ఉన్నాయని, సరైన పద్ధతిని ఎంచుకుని ప్రతీ తల్లి ఆరోగ్యంగా ఉండేందుకు కుటుంబ సంక్షేమ కార్యక్రమాల్లో భాగం పంచుకోవాలని సూచించారు. జిల్లాలో కుటుంబ నియంత్రణపై శిబిరాలు ఏర్పాటు చేసేలా కార్యాచరణ రూపొందించడం జరిగిందన్నారు. తాత్కాలిక పద్ధతులు ప్రతీ ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా లభిస్తాయని తెలిపారు. కుటుంబ సంక్షేమ కార్యక్రమాలలో ఉత్తమ సేవలు అందించినందుకు డాక్టర్ అరుణశ్రీ(సర్జన్), రాజేశ్వరి(ఏఎన్ఎం), మార్త(సూపర్‌వైజర్), డి.కవిత(ఆశ కార్యకర్త)లకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారులు డాక్టర్ నీరజ, డాక్టర్ విజయపూర్ణిమ, డాక్టర్ అరుణశ్రీ, డాక్టర్ సమత, డాక్టర్ ఫయాజ్, ఎస్‌వో వెంకటేశ్వర్లు, దామోదర్, శ్రీనివాస్, నాందేవ్, డీపీవో ప్రశాంతి, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ కరపత్రాలు విడుదల

మంచిర్యాలటౌన్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ మంచిర్యాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో జనాభా నియంత్రణ పోస్టర్లు, కరపత్రాలను ఆర్ఎంవో డాక్టర్ భీష్మ, డాక్టర్ వేదవ్యాస్, ఓహెచ్‌డీ డాక్టర్ లక్ష్మి గురువారం విడుదల చేశారు. అధిక జనాభాతో నిరుద్యోగం, ఆహార సమస్యలు పెరిగి దేశ అభివృద్ధికి ఆటంకం కలిగే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ వి.మధుసూదన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాల్‌మోహన్, కార్యదర్శి చంద్రమౌళి, వినయ్‌కుమార్, ఇరుకుల్ల ఆనంద్, గుండా శ్రీనివాస్, సురేందర్, ఎ.రాజేశ్వరరావు, సిరిపురం శ్రీనివాస్, కిష్టయ్య, చందూరి మహేందర్, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ అనిత

చట్టవ్యతిరేకులపై కఠిన చర్యలు

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్
- పులిమడుగులో 'కమ్యూనిటీ కాంటాక్ట్'



మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

రామకృష్ణాపూర్: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పులిమడుగు గ్రామంలో గురువారం కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ కొత్త వ్యక్తులు, నేరస్తులు గ్రామంలో షెల్టర్ తీసుకుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత గంజాయి, మద్యం, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. చెడు అలవాట్లకు బానిసై జీవితం నాశనం చేసుకోకూడదన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఇంటింటా సోదాలు నిర్వహించి సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, పట్టణ ఎస్సై రాజశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీల్లో సమస్యలు పరిష్కరించాలి

- డీఈవో యాదయ్యకు స్పెషల్ ఆఫీసర్ల వినతి

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లలో నెలకొన్న సమస్యలు పరిష్కారించాలని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో యాదయ్య, సెక్టోరియల్ అధికారి యశోధరను కోరారు. ఈమేరకు కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లు గురువారం వినతిపత్రం సమర్పించారు. కోతుల బెడద నివారణకు ప్రహరీ చుట్టూ రక్షణగా సోలార్ ఫెన్సింగ్ వేయాలని కోరారు. సోలార్ వాటర్ హీటర్లకు మరమ్మతులు చేయించాలన్నారు. విద్యార్థులకు గ్లాస్, ప్లేట్లు, ట్రంకు బాక్స్‌లు, దుప్పట్లు అందజేయాలని కోరారు. విద్యుత్ సమస్యను అధిగమించేలా త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేయాలని కోరారు. శుద్ధజలం అందించేందుకు ఆర్వో ప్లాంట్లకు మరమ్మతుతోపాటు, కొత్తగా ఆర్వో ప్లాంట్లు అమర్చాలన్నారు. సమస్యలు త్వరగా పరిష్కరించి విద్యార్థుల బోధనాభ్యసన ప్రక్రియకు తోడ్పాటు అందించాలని విన్నవించారు. చెన్నూరు, దండేపల్లి, వేమనపల్లి, భీమారం, జన్నారం, కాసిపేట, భీమిని, బెల్లంపల్లి కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లు సుమలత, మంజుల, మయూరి, ఫణిబాల, శ్రీవాణి, సరిత, కవిత, రజిత పాల్గొన్నారు.

ఎస్జీటీలపై వివక్ష తగదు

కాసిపేట: ఎస్జీటీలపై వివక్ష తగదని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్జీటీ సంఘం నాయకులు విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహరెడ్డికి గురువారం వినతిపత్రం అందజేసినట్లు సంఘం నాయకుడు కిరణ్‌కుమార్ తెలిపారు. ఎస్జీటీలు నిర్లక్ష్యం బారిన పడుతున్నారని నాన్ జాయినింగ్ లెఫ్ట్ ఓవర్ పోస్టుల విషయంలో అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. లాంగ్వేజ్ పండిత్‌లు, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ కాగా వారితోపాటే 2017 టీఆర్టీలో రిక్రూట్ అయిన ఎల్‌పీ-2, పీఈటీ పోస్టులను కొంత కాలం క్రితం అప్‌గ్రేట్ చేయడం జరిగిందన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు.

నాణ్యత లోపిస్తే చర్యలు

చెన్నూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసురాం అన్నారు. చెన్నూర్‌లోని మైనార్టీ, తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో నాసిరకం పప్పులు వినియోగిస్తున్నట్లు గుర్తించి డస్ట్ బిన్‌లో పడేశారు. బాలికల గురుకుల పాఠశాలలో రెండో రకం పప్పు దినుసులు వినియోగిస్తుండడంతో సదరు వార్డెన్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి నాసిరకం ఆహార పదార్థాలు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల నిరసన

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగదు రహిత చికిత్స అందించే ఎంప్లాయిమెంట్ హెల్త్ స్కీం పథకం సక్రమంగా అమలు కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులకు కార్పొరేటు ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందించాలని కోరారు. ఆస్పత్రులకు వెళ్లిన ప్రతీసారి పెద్దమొత్తంలో డబ్బులు చెల్లించాల్సి వస్తుందని పేర్కొన్నారు. పెన్షనర్ల నుంచి కమ్యూటేషన్ రికవరీ 12 సంవత్సరాలకు తగ్గించేందుకు తగిన చర్యలను తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

హైదరాబాద్‌లో జైపూర్ యువకుడి మృతి


హరీశ్ (ఫైల్)

జైపూర్: మండల కేంద్రానికి చెందిన తాటిపల్లి హరీశ్ (29) బుధవారం రాత్రి హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. నర్సింపూర్ గ్రామానికి చెందిన తాటిపల్లి శ్రీనివాస్ అలియాస్ డీలర్ శ్రీనివాస్–శోభారాణి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు హరీశ్ హైదరాబాద్‌లో హోటల్ నడిపిస్తున్నాడు. బుధవారం రాత్రి 11 గంటలకు కారులో వెళ్తుండగా గుండెనొప్పి రావడంతో కారులోనే మృతి చెందాడు. మృతునికి భార్య శ్రీవిద్య, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడికి గాయాలు


గాయపడిన బ్రహ్మారెడ్డి

జైపూర్: మండలంలోని వెలి శాల మల్లన్న ఆలయ సమీపంలో మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో చెన్నూర్ పట్టణానికి చెందిన సింగరేణి కార్మికుడు సూరం బ్రహ్మారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. చెన్నూర్‌లో నివాసం ఉండే బ్రహ్మారెడ్డి పని నిమిత్తం బైక్‌పై శ్రీరాంపూర్ వచ్చి ఇంటికి వెళ్తుండగా చెన్నూర్ నుంచి మంచిర్యాల వైపు వస్తున్న ట్రాలీ ఆటోను ఢీకొన్నాడు. తీవ్రగాయాలు కావడంతో 108లో ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ రెఫర్ చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు


సంఘటన స్థలంలో కారు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఐబీ సమీపంలో రాంనగర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బుధవారం రాత్రి ఓ కారు అతివేగంగా వచ్చి ఢీకొనడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ఒకరికి స్వల్పగాయాలయ్యాయి. స్తంభం పక్కనే ఉన్న మహేష్ మోటర్ డ్రైవింగ్ స్కూల్‌కు చెందిన కారు సైతం డ్యామేజీ అయ్యింది. స్థానికులు 100కు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్న బ్లూ కోట్ పోలీసులు వివరాలు సేకరించేందుకు ప్రయత్నించగా బాధితులు నిరాకరించారు. కాగా ప్రమాదానికి మైనర్ డ్రైవింగ్ కారణమని తెలిసింది. కొత్త స్తంభం ఏర్పాటు చేసేందుకు అయ్యే ఖర్చు భరిస్తానని బాధితులు చెప్పినట్లు ఏడీ వేణుగోపాల్ తెలిపారు. ఘటనపై స్థానిక పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జైపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై గోపతి సురేశ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వేంపల్లి శివారులో పేకాట ఆడుతున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు గురువారం జరిపిన దాడిలో అప్పాసు సత్తన్న, పెంట శ్రీనివాస్, మాదినేని రాజేందర్, మాదాసు అభిలాష్, ఆవుల మల్లేశ్ పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.9,200 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

అంతమొందిస్తున్నారు!

కొడుకే కాలయముడై..

నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం లక్ష్మీనగర్ తండాకు చెందిన లౌడియా ఇందిరాబాయి (64)ను ఆమె కుమారుడు రాంబాబు దారుణంగా హత్య చేశాడు. ఇందిరాబాయికి, రాంబాబుకు మధ్య కుటుంబ సమస్యలపై గొడవ జరిగింది. కుమారుడిని దుర్భాషలాడడంతో ఆగ్రహానికి గురైన రాంబాబు క్షణికావేశంలో పక్కనే ఉన్న కొడవలి తీసుకుని దాడిచేశాడు. తీవ్రంగా గాయపడిన ఇందిరాబాయి అక్కడికక్కడే కుప్పకూలింది.

కొడుకును కడతేర్చిన తండ్రి..

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం ఆకెనపల్లిలో భూమి పంపకం విషయంలో తలెత్తిన గొడవలో తండ్రి తనయుడిని కడతేర్చాడు. గ్రామానికి చెందిన దేవ మారాలు, బీరక్క దంపతులకు ఇద్దరు కుమారులు వినోద్ (30), దేవ వినీల్ సంతానం. డిగ్రీ చదివిన వినోద్ ఇంటివద్ద ఉంటూ వ్యవసాయం, కూలీ పనులు చేసేవాడు. తమకున్న రెండెకరాల వ్యవసాయభూమిని పంచివ్వాలని వినోద్ కొన్ని రోజులుగా తండ్రితో గొడవ పడుతున్నాడు. కొడుకు వేధింపులు భరించలేని తండ్రి పారతో కుమారుడి తలపై విచక్షణారహితంగా దాడిచేసి హతమార్చాడు.

- మంటగలుస్తున్న మానవత్వం
- విచ్ఛిన్నమవుతున్న ఆత్మీయ బంధాలు
- ఆందోళన కలిగిస్తున్న వరుస హత్యలు
- ఆస్తి తగాదాలు, వివాహేతర సంబంధాలే హత్యలకు ఊతం



మంచిర్యాలక్రైం: మానవత్వం మంటగలుస్తోంది.. మానవ సంబంధాలు 'మనీ' చుట్టు తిరుగుతున్నాయి. ఆస్తి కోసం క్షణికావేశంలో అయిన వారినే కడతేరుస్తున్నారు. అనుమానంతో ఒకరిని.. వివాహేతర సంబంధంలో మరొకరు.. పాత కక్షలతో ఇంకొకరు.. ప్రేమ వ్యవహారంలో మరొకరు.. ఆస్తి తగాదాలతో ఒకరు.. ఇలా చెప్పుకుంటూ పోతే కారణాలు ఏవైనా కావచ్చు..మానవ మృగాలుగా మారి మనుషులనే హతమారుస్తున్నారు. మానవ విలువలకు తిలోదకాలిస్తున్నారు. కొందరు నేరాలు చేయడానే ప్రవృత్తిగా ఎంచుకుంటున్నారు. హత్యలను నివారించడం పోలీసులకు పెను సవాల్‌గా మారింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల జరిగిన వరుస హత్యలపై 'సాక్షి' ప్రత్యేక కథనం...

హత్యలు పెరగడానికి కారణాలు..

ఉమ్మడి జిల్లాలో ఇటీవల జరిగిన హత్యలను పరిశీలిస్తే ఆస్తి తగదాలు, వివాహేతర సంబంధాలతో పాటు ప్రేమ వ్యవహారాలూ కారణమవుతున్నాయి. ఒకచోట వివాహేతర సంబంధం కారణంగా భార్యను భర్త అంతమొందించగా మరోచోట భర్తను భార్య హత్య చేయించింది. మరోచోట స్థిరాస్తి వివాదంలో రియల్ ఎస్టేట్ వ్యాపారికి నమ్మినబంటే నమ్మించి అతి కిరాతంగా నరికి చంపేశాడు. కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలు సమస్య ఏదైనా ఇరువురి సమన్వయంతో న్యాయపరంగా పరిష్కరించుకోవచ్చు. లేదా పెద్దల సమక్షంలో పరిష్కరించుకునే ప్రయత్నం చేయవచ్చు. కొన్ని సందర్భాల్లో కొందరికి అన్యాయం జరుగుతోంది. అన్యాయానికి గురైన వారు ప్రతీకారం తీర్చుకునేందుకు ఎంతటికైనా తెగిస్తున్నారు. ఇటీవల జిల్లాలో సుపారీ హత్యలు పెరిగిపోయాయి. దీనికి రాజకీయ నాయకుల అండ, చట్టాలు కఠినంగా లేకపోవడమే ప్రధాన కారణమని మేధావి వర్గం భావిస్తోంది. ఇలా హత్య చేసి అలా బెయిల్‌పై బయటకు వచ్చి హంతకులు యథావిధిగా ప్రజల్లోనే దర్జాగా తిరుగుతుండడం పరిపాటిగా మారింది. కొన్నాళ్లకు హత్య కేసులో సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసులు కొట్టుడు పోవడం, కొన్ని కేసుల్లో శిక్షలు పడడం, ఇదంతా నేరం జరిగిన కొన్ని సంవత్సరాల కాలం పట్టడం ఆందోళన కలిగిస్తోంది..

రోడ్డున పడుతున్న కుటుంబాలు

హత్యలకు పాల్పడిన వారు చట్టం చేతిలోంచి తప్పించుకునే పరిస్థితులు లేవు. తెలివిగా హత్య చేసి ఆధారాలు లేకుండా తప్పించుకోవాలనుకుంటారు. పోలీసులు సాంకేతికతను ఉపయోగించి ఎక్కడో ఒకచోట చిన్న క్లూ దొరికితే నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపిస్తున్నారు. కోర్టులో జైలుశిక్ష పడడంతో నెలలు, ఏళ్ల తరబడి కుటుంబ సభ్యుల కు దూరంగా ఉంటున్నారు. అంతేకాకుండా బెయిల్ కోసం పెద్దమొత్తంలో డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. బెయిల్ వచ్చినా సమాజంలో వారిని హంతకులుగా చూస్తారు. కేసు విచారణ తర్వాత శిక్ష కూడా పడే అవకాశం ఉంటుంది. దీంతో బాధిత కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

మచ్చుకు కొన్ని సంఘటనలు

- మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోపాల్‌వాడకు చెందిన బత్తిని శరణ్య(27) సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జియా ఉల్ హక్‌ను 2012లో హైదరాబాద్‌లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. దంపతులకు ఒక పాప జన్మించిన తర్వాత మరో యువతితో అక్రమ సంబంధం పెట్టుకుని శరణ్యకు దూరంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో శరణ్య భర్తపై కేసు పెట్టింది. దీంతో విడాకులు కావాలని భర్త కోరడంతో నిరాకరించింది. జియా ఉల్ హక్ పథకం ప్రకారం తనకు తెలిసిన వ్యక్తులకు సుపారి ఇచ్చి 2023 ఆగస్టు 10న అతి కిరాతకంగా హత్య చేయించాడు.
- తాండూర్ మండలంలోని అచ్చులాపూర్‌కు చెందిన సిద్దం శ్రీనివాస్ (40) భార్య బానక్క తాండూర్‌కు చెందిన మేడి శంకర్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. విషయం తెలిసిన శ్రీనివాస్ పలుమార్లు మందలించాడు. దీంతో బానక్క ప్రియునితో కలిసి 2023 ఆగస్టులో భర్తను హత్య చేయించింది.
- 2023 ఏప్రిల్ 11న మంచిర్యాలకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నడిపెల్లి లక్ష్మీకాంతారావు (63)ను అతనితో కలిసి వ్యాపారం చేస్తూ నమ్మకంగా ఉండే మామడి శ్రీనివాస్ స్థిరాస్తి విషయంలో వివాదం తలెత్తడంతో పథకం ప్రకారం హత్యచేశాడు.

చట్టాలపై అవగాహన లేకనే..



చట్టాలపై అవగాహన లేకపోవడమే ప్రధానకారణం. నేరం చేస్తే శిక్షలు ఉంటాయనే విచక్షణ జ్ఞానం కోల్పోతున్నారు. నేరం చేసిన తర్వాత జరిగే పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరు. నేర ప్రవృత్తిని నిర్మూలించేందుకు పోలీస్ శాఖ ఎంతగానో కృషి చేస్తోంది.

– ఎం.శ్రీనివాసులు, రామగుండం పోలీస్ కమిషనర్

విచక్షణ కోల్పోతున్నారు



మనిషిలో స్వార్థం పెరిగిపోయింది. బంధాలు, బంధుత్వాలు, ప్రేమ, ఆప్యాయతలు, అనురాగాలు కనిపించడంలేదు. దీనంతటికీ కారణం డబ్బు. ఆస్తులు, అంతస్తుల కోసమే అయిన వారిని వదులుకుంటున్నారు. దీనికి తోడు చాలామంది మద్యం, డ్రగ్స్, మత్తులో క్షణికావేశంలో హత్యలు, నేరాలకు పాల్పడుతున్నారు.

– విశ్వేశ్వర్‌రావు, మానసిక వైద్య నిపుణులు, మంచిర్యాల

ఇసుక డంపులు సీజ్


సీజ్ చేసిన ఇసుక వద్ద పోలీసులు

చెన్నూర్‌రూరల్: పోలీసులు, రెవెన్యూశాఖ అధికారులు కలిసి మండలంలోని నర్సక్కపేట, పొగెపల్లి, ముత్తరావుపల్లి గ్రామ సమీపంలోని పంట పొలాలు, ఇళ్ల సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను గురువారం సీజ్ చేసినట్లు చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. పలువురు ట్రాక్టర్ యజమానులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ రంజిత్ ఉన్నారు.

ఓవర్ హాలింగ్ పనుల పరిశీలన


పరిశీలిస్తున్న సత్యనారాయణరావు

జైపూర్: మండల కేంద్రంలోని 1200 మెగావాట్ల ఎస్టీపీపీ యూనిట్–2లో కొనసాగుతున్న క్యాపిటల్ ఓవర్ హాలింగ్ పనులను గురువారం సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ఎం) డి.సత్యనారాయణరావు పరిశీలించారు. బాయిలర్, టర్బైన్‌తో పాటు అన్నివిభాగాల్లో కొనసాగుతున్న పనులపై ఆరా తీశారు. యూనిట్–2లో వీలైనంత త్వరగా విద్యుత్ ఉత్పత్తికి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. క్యాపిటల్ ఓవర్ హాలింగ్ పనులు చేపడుతున్న అధికారులు, ఉద్యోగులను ఉత్తేజపరుస్తూ వారి పని తీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాగే పని చేస్తూ పనులు త్వరగా పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు.

నాలుగో రోజుకు చేరిన దీక్షలు


దీక్షలో పాల్గొన్న వాసిరెడ్డి సీతారామయ్య

మందమర్రిరూరల్: తెలంగాణలోని నూతన బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం వేలం లేకుండా సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేస్తూ ఏరియాలోని జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్షలు గురువారం నాటికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఏఐటీయూసీ కేంద్ర కమిటీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సుదర్శన్, మల్లేశ్, అక్బర్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: బొగ్గు గనుల వేలంను నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజుకు చేరాయి. గురువారం ఆ యూనియన్ నాయకులు దీక్షలో కూర్చొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, నాయకులు మురళి చౌదరి, మోత లచ్చన్న, నరసింహారావు, ఆకుల లక్ష్మణ్, మొగిలి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త డీజీపీ ఫస్ట్ పోస్టింగ్ నిర్మల్‌లోనే..

- ఇప్పటికీ ఈ ప్రాంతమంటే మక్కువ
- జిల్లావాసులతో సత్సంబంధాలు


గతేడాది నిర్మల్‌కు వచ్చినప్పుడు వైద్యదంపతులు శోభ-సుభాష్‌రావుతో డీజీపీ దంపతులు

నిర్మల్: కొత్త డీజీపీ జితేందర్‌కు నిర్మల్‌తో సంబంధం ఉందన్న విషయం అందరికీ తెలిసిందే. ఐపీఎస్‌గా తన శిక్షణ పూర్తిచేసుకోగానే ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారు. అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ)గా నిర్మల్‌లో తన తొలిపోస్టింగ్ తీసుకున్నారు. 1995 జనవరి నుంచి డిసెంబర్ దాకా దాదాపు ఏడాదికాలం ఈ డివిజన్ పోలీస్‌బాస్‌గా పనిచేశారు. అప్పటి డివిజన్ అంటే.. ఇప్పుడున్న జిల్లా మొత్తం వస్తుంది. అలా ఇక్కడి ప్రాంతంపై కొత్త డీజీపీకి పూర్తి అవగాహన ఉంది.

ఇప్పటికీ సత్సంబంధాలు..

ఏఎస్పీగా నియమితులు కాగానే ఆయన రేణుకను పెళ్లి చేసుకున్నారు. వారికి తొలి సంతానంగా ఆడబిడ్డ కూడా నిర్మల్‌లో ఉన్నప్పుడే జన్మించింది. స్థానిక ఎస్‌బీఆర్ ఆస్పత్రిలో డాక్టర్ శోభారాణి డెలివరీ చేశారు. అలా అప్పటి నుంచి వైద్యదంపతులు శోభారాణి–సుభాష్‌రావుతో డీజీపీ జితేందర్ కుటుంబం సత్సంబంధాలు కొనసాగిస్తోంది. ఎప్పుడు నిర్మల్‌వైపు వచ్చినా.. కచ్చితంగా ఇక్కడికి వస్తారని, తమ ఇంటికి వచ్చి మాట్లాడిస్తారని డాక్టర్ సుభాష్‌రావు తెలిపారు. తన తొలిపోస్టింగ్, పెళ్లి, తనకిష్టమైన ఆడబిడ్డ పుట్టడం అన్నీ నిర్మల్‌లో ఉన్నప్పుడే జరగడంతో కొత్త డీజీపీకి ఈ ప్రాంతం అంటే ఇష్టమని ఆయన వెల్లడించారు. నిర్మల్ నుంచి వెళ్లిన ఓ మంచి అధికారి పోలీస్‌శాఖలో డీజీపీస్థాయికి చేరుకోవడం చాలా సంతోషన్నిచ్చిందని చెప్పారు.

జ్యూవెల్లర్స్ యజమానుల పరారీ..!

- జనానికి రూ.కోట్లలో టోకరా?

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా కేంద్రంలోని ఓ జ్యూవెల్లర్స్ షాపు యజమానులు పట్టణ ప్రజలకు రూ.కోట్లలో టోకారా వేసి పరారయ్యారు. గురువారం సంచలనం రేపిన ఈ తాజా సంఘటన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్న ఓ జ్యూవెల్లర్స్ యజమాని, అతని కుమారుడు కొంతకాలంగా నమ్మకంగా ఉంటూ బంగారు దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ట్రేడ్ మార్కెట్‌లో కూడా పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో పట్టణంలోనే కాకుండా పరిసర ప్రాంతాలకు చెందిన పలువురి నుంచి బంగారు ఆభరణాలతో పాటు నగదు రూపంలో పెద్ద ఎత్తున అప్పులు చేసి మరీ ట్రేడ్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టినట్లు సమాచారం. మొదట్లో కలిసివచ్చినా ఆ తర్వాత నష్టాలు రావడంతో గుట్టుచప్పుడు కాకుండా అప్పులు చేస్తూ మరీ నష్టాలకు గురయ్యారు. ఇటీవల అప్పులు ఇచ్చిన వారు తిరిగి అడుగుతుండగా వారి సమాధానాలు అనుమానాలకు గురిచేయడంతో ఒత్తిడి తీసుకువచ్చారు. ఒత్తిడి తట్టుకోలేక రెండు రోజుల క్రితం యజమాని కుమారుడి అచూకీ తెలియక పోవడంతో తండ్రిపై ఒత్తిడి పెరిగింది. దీంతో బుధవారం రాత్రి అతను పరారయ్యాడు. అంతేకాకుండా గురువారం కుటుంబ సభ్యులు సైతం ఇంటినివదిలి వెళ్లిపోయారు. వారం రోజులుగా మంచిర్యాల బులియన్ మర్చంట్ అసోసియేషన్‌తో రహస్యంగా మంతనాలు సాగిస్తున్న బాధితులు ఒక్కొక్కరిగా వెలుగులోకి రావడంతో జ్యూవెల్లర్స్ యజమానులు రూ.కోట్ల లో అప్పులు చేసి పరారైనట్లు వార్త దావానంలా వ్యాపించడంతో ఈ సంఘటన పట్టణంలో సంచలనం సృష్టించింది. ఏది ఏమైనా అప్పులు ఇచ్చిన వారు బయటకు వస్తేనే పూర్తి వివరాలు తెలియనున్నాయి. అయితే రూ.10 కోట్లకు పైగానే అప్పులు చేసి ఉడాయించారని పట్టణంలో గుసగుసలాడుకోవడం కొసమెరుపు.

సీఎం దృష్టికి ట్రిపుల్‌ఐటీ సమస్యలు

- పరిష్కారం కోసం విద్యార్థుల నిరీక్షణ
- ఏళ్లుగా సమస్యలతోనే చదువులు
- రెగ్యులర్ వీసీని నియమించాలని వినతులు
- ఆస్పత్రి ఆధునీకీకరించాలని వేడుకోలు


బాసర ట్రిపుల్‌ఐటీ

భైంసా: బాసరలోని ట్రిపుల్‌ఐటీ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల్లో కొంత మంది హైదరాబాద్‌కు వెళ్లారు. యూనివర్శిటీ స్టూడెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆకాశ్ బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ట్రిపుల్ ఐటీలోని పరిస్థితుల గురించి విన్నవించారు. సీఎం హోదాలో ఒక్కసారి ట్రిపుల్‌ఐటీని సందర్శించాలని విజ్ఞప్తి చేశారు. సమయం చూసి తప్పకుండా వస్తానని సీఎం హామీ ఇచ్చారు. రెండేళ్ల క్రితం వేలాది మంది విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసి యూనివర్శిటీ రోడ్లమీద నిరసనలు తెలిపారు. అప్పట్లో టీపీసీసీ అధ్యక్షులుగా రేవంత్‌రెడ్డి పోలీసు వలయాలను దాటుకుని ట్రిపుల్‌ఐటీ గోడ దూకి విద్యార్థుల వద్దకు వెళ్లారు. అప్పటి సమస్యలు ఇప్పుడూ అలాగే ఉన్నాయి. ఈ సమస్యలపై విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో ఓ కమిటీ వేసి పరిష్కారం కోసం దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో విద్యార్థులే హైదరాబాద్‌కు వెళ్లి సీఎంను కలిసి 19 సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సీఎం సూచన మేరకు ఆయన వ్యక్తిగత సలహాదారు జైపాల్‌రెడ్డిని కలిసి లిఖిత పూర్వకంగా వినతిపత్రం ఇచ్చారు.

సమస్యలు ఇవే...

- బాసర ట్రిపుల్‌ఐటీలో రెగ్యులర్ వీసీ ఉండాలి. అలా ఉంటే ఇక్కడి అన్ని విభాగాలపై దృష్టి సారిస్తారు. విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలు గమనిస్తారు. ఫలితంగా ఇక్కడే పరిష్కారం అవుతాయి.
- ట్రిపుల్‌ఐటీలో సరైన ఫ్యాకల్టీ లేదు. చాలా విభాగాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- ఆస్పత్రిని ఆధునీకరించి వైద్యసేవలు విస్తరించాలి.
- విద్యార్థుల ఆత్మహత్యలపై దృష్టి సారించాలి. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ విషయాలపై ఇప్పటి వరకు సరైన ఆధారాలు సేకరించలేకపోతున్నారు. ఆత్మహత్యలు జరిగిన సమయంలో ఏదో ఒక సమాధానం ఇచ్చి దాటవేస్తున్నారు. ఆత్మహత్యలకు గల కారణాలను తెలుసుకోవడంలేదు.
- విద్యార్థుల తల్లిదండ్రులను లోనికి అనుమతించకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ప్రధాన గేటువద్దే నిరీక్షిస్తున్నారు.
- విద్యార్థుల సమస్యలు చెప్పుకునేందుకు ప్రత్యేక కమిటీని నియమించాలి.
- మెస్‌లలో రుచికరమైన భోజనాలు ఉండడం లేదు. పాత మెస్ టెండర్లను రద్దు చేయాలి. కొత్త టెండర్లు వేసి నాణ్యమైన, రుచికరమైన భోజనాలు అందించాలి.
- విద్యార్థులకు సరిపడా క్రీడాపరికరాలు అందించాలి.
- హాస్టల్ గదుల్లో మౌలిక వసతులు లేవు. బెడ్లు, ఇతర ఫర్నిచర్ పూర్తిగా దెబ్బతిన్నాయి. కొత్త ఫ్యాన్లు బిగించాలి.
- విద్యార్థులకు సంబంధించిన కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అందించాలి.
- సెంట్రల్ లైబ్రరీలో మరిన్ని సౌకర్యాలు కల్పించాలి.
- బయటి నుంచి వచ్చే మత్తు పదార్థాలను అరికట్టాలి.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: ఈనెల 14న నస్పూర్ కాలనీలో నిర్వహించనున్న బీఎంఎస్ మహాసభల పోస్టర్‌ను గురువారం ఆర్కే 7 గనిపై ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన కోసం ఈ మహాసభలో చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. కార్మికులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు బోయిన మల్లయ్య, మోతె ఓదెలు, కుంట రాజు, గొల్ల మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీలో మెడికల్ క్యాంప్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో ఓబీ కాంట్రాక్టు సంస్థ సీఆర్ ఆర్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు గురువారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమానికి ఏరియా డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి టీ శ్రీనివాస్, వైద్యులు లోకనాథ్ రెడ్డి, ఇంజనీర్ శ్యాంసుందర్‌రావు, సంక్షేమాధికారి బొంగోని శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి


రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

శ్రీరాంపూర్: ఉద్యోగులు విధి నిర్వహణలో రక్షణతో పనిచేయాలని కార్పొరేట్ జీఎం సేఫ్టీ కే.గురువయ్య అన్నారు. గురువారం ఆర్కే 6 గనిపై ఉద్యోగులతో మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి స్వీయ రక్షణతో పని చేస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. రక్షణపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం ఈ నెలలో ఉద్యోగ విరమణ పొందనున్న ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, ఏజెంట్ ఏవీ రెడ్డి, గని మేనేజర్ తిరుపతి, రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, సంక్షేమాధికారి సునీల్ కుమార్, వెంటిలేషన్‌అధికారి రాంనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల్లో పోలీసుల తనిఖీ


సీసీటీవీ ఫుటేజీ పరిశీలిస్తున్న ఎస్సై సురేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిధిలోని బ్యాంకుల్లో గురువారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. రామగుండం సీపీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ ఆధ్వర్యంలో ఎస్సై గోపతి సురేశ్ మండలంలోని యూనియన్ బ్యాంకు, దక్కన్ గ్రామీణ బ్యాంకుల్లో తనిఖీ నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తుల వివరాలు ఆరా తీశారు. భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో పనిచేసే అలారం సిస్టమ్‌ను సైతం పరిశీలించి పలు సూచనలు చేశారు. బ్యాంకు సిబ్బందితో ఎస్సై సురేశ్ మాట్లాడుతూ అనుమానాస్పదంగా ఎవరైనా కనిపించినా, కార్యకలాపాలకు ఇబ్బందులు కలిగించినా స్థానిక పోలీసులకు లేదా 100కు సమాచారం అందించాలని సూచించారు.